క్లుప్తంగా

ఎంఈవో-2గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కొయ్యూరు: ఎంఈవో-2గా మండలంలోని బాలారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంఈవో-2గా పనిచేసిన నాగభూషణం హెచ్‌ఎంగా మరో పాఠశాలలో విధుల్లో చేరారు. దీంతో సీనియర్ ఉపాధ్యాయులైన ప్రసాద్‌ను ఉన్నతాధికారులు ఎంఈవో-2గా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ త్వరలో అన్ని పాఠశాలలను సందర్శిస్తామన్నారు.

58 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్యులు

అడ్డతీగల: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా సోమవారం 58 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్ తెలిపారు.వీరిలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశామన్నారు. గైనకాలజిస్టు స్నిగ్ధ ,ప్రసన్నదేవి ఆధ్వర్యంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర పరీక్షలు జరిపి తల్లి,బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఆహార నియమాలు, పౌష్టికాహారం వంటి అంశాలపై ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు వివరించారు. వైద్యులు అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి



మృతి చెందిన అచ్చియమ్మ

గూడెంకొత్తవీధి: జెర్రెల పంచాయతీ చింతలపాడు ఆశా కార్యకర్త లువ్వా అచ్చియమ్మ (53) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమెకు కొద్ది రోజుల కిందట గుండెనొప్పితో అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం కొన్ని రోజుల కిందట కేజీహెచ్‌లో చేర్పించినట్టు కుటుంబీకులు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు తెలిపారు.


దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నాలుగు పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. దారకొండలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సీలేరు, దారకొండ, దుప్పిలవాడ, గుమ్మిరేవుల పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారకొండ మండల సాధన కమిటీను ఏర్పాటు చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణుమూర్తి మాట్లాడుతూ మండలాల పునర్విభజనకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీలేరు, దారకొండ గుమ్మిరేవుల సర్పంచులు దురో, ఎస్.రాజు, ముర్ల కమలమ్మ, దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, మాజీ సర్పంచులు రాజు, బాబూరావు, ఏసువరరాజు, మాజీ ఎంపీటీ గోవిందు, అఖిలపక్ష నాయకులు శ్రీనివాసు, మల్లుదొర, రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ప్రతిష్ట మహోత్సవం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి ప్రతిష్ట(వార్షికోత్సవం) మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, అమ్మవారి ప్రత్యేక అలంకరణ, ఆలయ మండపంలో దంపతులతో సామూహిక కుంకుమ పూజలు వంటి అనేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయానికి వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు.



అమలగుడలో వంతెన నిర్మించనున్న స్థలం ఇదే





కుక్కుడబెడ్డ , అమలగుడ గ్రామాల్లో రోడ్డు నిర్మాణానికి నోచుకోక అడవి తల్లి బాట పేరుతో బోర్డులకే పరిమితమైన మార్గాలు

దారుణ దారులు

- నిధులు మంజూరైనా ప్రారంభానికి నోచుకోని పనులు
- గ్రామస్తుల శ్రమదానంతో తాత్కాలిక దారి
- రాళ్లు తేలిన నేరేడువలస రహదారి
- అడవితల్లి బాటలు బోర్డులకే పరిమితం
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలు నీటి మూటలంటున్న గిరిజనం



బుడ్డింగు రోడ్డు దుస్థితి



బుడ్డింగు గ్రామనికి శ్రమదానంతో రోడ్డు వేస్తున్న గ్రామస్తులు



రాళ్లు తేలిన రంగిలిసింగి-బిల్లపుట్టు రోడ్డు



రోడ్డు కోసం శ్రమదానంతో బండరాళ్లను తొలగిస్తున్న గ్రామస్తులు



రోడ్డు సౌకర్యం లేక కాలినడకన వెళ్తున్న కుక్కుడబెడ్డ, స్వర్ణయిగుడ గిరిజనులు

డుంబ్రిగుడ: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు అన్న చందంగా ఉంది తూటంగి పంచాయతీలోని రహదారుల వ్యవస్థ. మండలంలోని తూటంగి పంచాయతీ మారుమూల బుడ్డింగి గ్రామనికి వెళ్లే రాహదారికి నిధులు మంజూరైన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్టర్ ఉడాయించడంతో పనులు జరగలేదు, దీంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఆ గ్రామానికి రాకపోకలకు స్థానికులు శ్రమదానంతో చిన్న దారి ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ దారి కూడా పూర్తిగా మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. గ్రామానికి ద్విచక్రవాహనం సైతం వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. అయినా పట్టువీడని ఆ గ్రామస్తులు మరోమారు శ్రమదానంతో పెద్దపెద్ద బండరాళ్లు తొలగించి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు.

ప్రారంభానికి నోచుకోని రహదారితో అవస్థలు

జర్రాయి గ్రామం నుంచి బుడ్డింగి గ్రామానికి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. గ్రామస్తులు శ్రమదానంతో తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేసుకున్నారు. గోతులతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరేడువలస గ్రామనికి వెళ్లె రహదారిలో రాళ్లు తేలి నడవడానికి వీలు లేకుండా వుంది.

ఉప ముఖ్యమంత్రి నిరక్ష్యవైఖరి

ఇటీవల గిరిజన ప్రాంతంలోని పర్యటించిన ఉప ముఖమంత్రి పవన్‌కల్యాణ్ గిరిజన ప్రాంతంలోని రోడ్లని అడవితల్లిబాట పేరుతో వేసేందుకు చర్యలు తీసుకున్నామని వాటిని బోర్డులను ఏర్పాటు చేయించారు. అయితే మండలంలోని మూడు రోడ్లు అడవితల్లిబాటలు మంజూరయ్యాయి. పోతంగి పంచాయితీ అమలగుడ, కండ్రుమ్ పంచాయితీలోని కుక్కుడబెడ్డ, శిరసగుడ గ్రామలకు రోడ్డు వేసేందుకు అడవితల్లి బాట బోర్డులు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈనెల 3న కుక్కుడబెడ్డ గ్రామం నుంచి రోడ్డును ప్రారంభించి పనులు నిలిపివేశారు. మా గ్రామాలకు రహదారుల కోసం ఆర్భాటంగా ఉప ముఖ్యమంత్రి బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉప ముఖ్యమంత్రి నిర్లక్ష్యం వల్ల ఒక్క రహదారి పని ప్రారంభానికి నోచుకోలేదంటున్నారు. ఉత్సవ విగ్రహాల్లా బోర్డులు దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు.

కాలినడకే శరణ్యం

ప్రధానమంత్రి జన్‌మన్ గృహాల కల్పనతో ఆయా గ్రామాల్లో గృహ నిర్మాణ సామగ్రి తరలించేందుకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అధ్వాన గోతుల రహదారుల మీదుగానే రోజు కాలి నడకన గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమలగుడలో రోడ్డుతో పాటు వంతెన ఏర్పాటు చేయ్యాల్సి ఉంది. అలాగే రంగిలిసింగి పంచాయితీ సీ కాలనీ నుంచి బిల్లపుట్టు వరకు మట్టిరోడ్డులో గ్రావెల్ పూర్తిగా తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాలకు రహదారులు నిర్మించాలని వారు కోరుతున్నారు

ఈ విషయాన్ని స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అభిషేక్ వద్ద సాక్షి ప్రస్తావించగ కలెక్టర్ రివ్యూ మీటింగ్‌లో ఉన్నానని చెప్పారు. మండలంలోని రహదారుల సమస్య విషయాన్ని దాటవేశారు.

అధికారుల నిర్లక్ష్యం



మండలంలోని రోడ్ల అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకొకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏప్రిల్ నెలలో మండలంలోని పెద్దపాడు గ్రామనికి సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గిరిజన ప్రాంతంలోని రోడ్లుకు శంకుస్థాపన చేసి రెండు నెలలో పూర్తి చేస్తామని చెప్పి నేటికి ఐదు మాసాలు కావస్తున్న రోడ్డు పనులు ప్రారంభించకపోవడం దారుణం.

– పాంగి పరశురామ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, రంగిలిసింగి గ్రామం, డుంబ్రిగుడ మండలం

రాకపోకలకు ఇబ్బందులు



స్వర్ణయిగుడ నుంచి కుక్కుడబెడ్డ వరకు రోడ్డు అస్థవ్యస్తంగా ఉంది. అడవితల్లి బాట పేరుతో అధికారులు గత రెండు నెలల క్రితం రోడ్డు పనులకు బోర్డులు వేశారు. నేటివరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. ఈవర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.

– కొర్ర రాజారావు, స్వర్ణయిగుడ, కండ్రుమ్ పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



జడ్డంగిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చినబాబు



గంగవరంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది

హుకుంపేట: మండలంలోని పాడేరు- హుకుంపేట ప్రధాన రహదారి కొంతిలి జంక్షన్ వద్ద సోమవారం ఎస్‌ఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు, లైసెన్స్ ఇతరత్రా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ ఇతరత్రా వాహనపత్రాలు కలిగి ఉండాలని లేనిపక్షంలో కేసులు తప్పవని హెచ్చరించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం మత్తుతో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

గంగవరం : మద్యం మత్తులో వాహనాలు నడిపినా, మైనర్ లకు వాహనాలు ఇచ్చిన హెల్మెట్ లేకుండా వెహికల్ నడిపిన వాహనాలు వేగంగా నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేష్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం గంగవరం శివారులో అడ్డతీగల రహదారిలో జాతీయ రహదారిపై ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారి పైన చర్యలతో పాటు వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ ఇతర రికార్డులు లేని వారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేసి రశీదులు ఇచ్చినట్టు ఎస్‌ఐ చినబాబు తెలిపారు. సెంటర్లో ప్రజలు, వాహనచోదకులతో సమావేశం ఏర్పాటు చేసి మోటారు వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొంటామని తల్లిదండ్రులను హెచ్చరించారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

చింతపల్లి: కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలో ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు.అల్లూరి జిల్లాలోనే అత్యధిక కాఫీ పంట చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, జి మాడుగులు మండలాల్లో పండుతుందన్నారు. కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చింతపల్లి ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి కూడా అందుబాటులో ఉందన్నారు.అన్ని విధాలుగా అవకాశాలున్నటువంటి ఏజెన్సీలో కాకుండా మైదాన ప్రాంతమైన మాకవరపాలెం మండలం శెట్టిపాలెంలో ఈ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూటమని ప్రభుత్వం నిర్ణయించడం ఎంత వరకూ సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికే జీవో నెం-3 రద్దుతో గిరిజన నిరుద్యోగు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాఫీ యూనిట్‌ను చింతపల్లిలో ఏర్పాటు చేస్తే ఎంతో మంది గిరిజన నిరుద్యోగులకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను ఉపాధి దొరుకుతుందన్నారు.గిరిజన రైతాంగానికి, నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే కాఫీ ప్రాజెక్టును స్పీకర్ తన నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో ఏర్పాటుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి ఎంతో అవసరమైన కాఫీ ప్రాసెసింగ్ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రికి వివరించడంలో కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, జిసిసి ఎండి, సంబంధిత అధికారులు విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వ ముసుగులో మన ప్రాంతానికి చెందిన కాఫీ యూనిట్ మైదాన ప్రాంతానికి తరలిపోకుండా అన్ని రాజకీయ పార్టీలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గూడెం కొత్తవీధి వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చింతపల్లి-చౌడుపల్లి మధ్యలో శ్మశాన వాటిక వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గొయ్యి

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రం నుంచి చౌడుపల్లి వెళ్లే మార్గంలో వంతెన వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా ప్రతి రోజు చౌడుపల్లి, జెర్రెల పాటు పాడేరు ప్రాంతాలకు వెళ్లేవారు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇక్కడున్న శ్మశాన వాటిక వద్ద ఉన్న వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ప్రమాదకరంగా గొయ్యి ఏర్పడింది. ఈ మార్గం ద్వారా ప్రయాణం సాగిస్తున్న వాహనచోదకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఎటువంటి హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదుకేవలం ఒక ప్లాస్టిక్ కవరు గుర్తుగా ఉంచారు. మండల కేంద్రంలోనే ఈ ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో వాహనచోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గమనించకపోతే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గోతుల సమస్యతో రహదారిపై నిలిచిన టిప్పర్



రహదారిలో గోతులను పూడుస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, సభ్యులు

ఎటపాక: ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు ప్రాంతం ఎటపాక ప్రధాన రహదారి గోతులమయంగా మారింది.ఈ రహదారిలో చర్ల ప్రాంతం నుంచి వందలాది ఇసుకలారీలు తెలంగాణాకు తరలివెళ్తుండడంతో రహదారి ధ్వంసమైంది. అయితే సోమవారం ఎటపాక పోలీస్టేషన్ సమీపంలో మెటల్‌తో వస్తున్న టిప్పర్ గోతులున్న ప్రాంతంలో దిగబడింది. ముందుకు వెళ్లలేక నిలిచింది. దీంతో గంటల తరబడి భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న జేకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ అక్కడకు చేరుకుని తనకు చెందిన పొక్లెయిన్ సాయంతో టిప్పర్‌ని రహదారిపై నుంచి పక్కకు తొలగించారు. గోతులు ఉన్న ప్రాంతాన్ని చదునుచేయడంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. భారీ వాహనాలను నియంత్రించి ఎటపాక పోలీసులు రహదారిని క్లియర్ చేశారు. బోల్తాపడిన టిప్పర్ డ్రైవర్ అనారోగ్యంగా ఉండడంతో అతడికి వైద్య సహాయం అందించారు.

విస్తారంగా వర్షాలు.. జోరుగా పనులు



టిల్లర్‌తో దున్నుతున్న రైతు



కూరగాయల సాగులో రైతులు

డుంబ్రిగుడ: మండలంలో ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాయ. మండల వ్యాప్తంగా గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో సంవృద్ధిగా నీరు చేరింది. దీంతో వరితో పాటు కూరగాయాల పంటలకు ఎంతో మేలు జరిగిందని రైతులు చెబుతున్నారు. మండలంలోని గుంటసీమ, గుంటగన్నేల, రంగిలిసింగి, అరమ, అరకు పంచాయితీల్లో వరి పంటను విస్తృతంగా పండిస్తున్నారు. సొవ్వా, కండ్రుమ్, పోతంగి, తూటంగి, గసభ, కురిడి పంచాయల్లో విస్తారంగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పంటలు చేతికందే దశలో ఉండగా, కొన్ని నాట్లు, విత్తు దశలో ఉన్నాయి.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



జడ్డంగిలో పనిచేయని మంచినీటి పథకం



ట్యాంకుపైకి వెళ్లే మెట్లు దుస్థితి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి రక్షిత తాగునీటి పథకం శిథిలావస్థకు చేరకుంది. చుక్క నీరందించని పరిస్థితిలో ఉంది. ఈ పథకం దాదాపు 15 సంవత్సరాల క్రితం, 20వేల లీటర్ల సామర్థ్యంలో నిర్మించారు. ఇటీవల ఈ పథకానికి చెందిన విద్యుత్ పోల్, మీటర్‌పై పిడుగుపడటంతో ఇది పూర్తిగా పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పథకం కింద దాదాపు 300 కుటుంబాలు ఆధారపడి ఉన్నారు. నీటి పథకం పనిచేయకపోవడంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతం లేక స్థానికులు మడేరు వాగుపై ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలన వారు కోరుతున్నారు.

పాఠశాలల కోసం ప్రతిపాదన

కొయ్యూరు: విద్యార్థులుండి పాఠశాలలు లేని చోట్ల పది ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ కేంద్రాలను (నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్స్ సెంటర్) ఏర్పా టు చేయనున్నారు. దీనికి సంబంధించి పాఠశాలలు లేని గ్రామాల్లో సమీపంలోని ఎక్కడైతే పాఠశాలలున్నాయో అక్కడ విద్యార్థుల వివరాలను యు డైస్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో వాటి వివరాలను డీఈవోకు నివేదించినట్టు ఎంఈవో రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈదులబంద, గంపరాయి, పిట్టలపాడు, గొందికోట, పుట్టకోట, జాజులబంద, బొడ్డుమామిడిలంక, బిల్లుపాలెం, కాకుల మామిడి, కొమ్మనూరు, లోయల పాలెంలో ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.